
కథ

# తమసోమా జ్యోతిర్గమయ

సరిపల్లి మంజుల



"ఏమేవ్, అమెరికానుంచి అబ్బాయి ఉత్తరం రాసేడు. వచ్చే నెలాఖరుకి వాళ్లంతా వస్తున్నార్ట". ఉత్తరం పూర్తిగా చదవకుండా మధ్యలోనే ఆపి, సీతమ్మకి కబురు వినిపించేరు సుందరంగారు. అతని గొంతుకలో అదొకరకమైన ఆనందం, ఉత్సాహం కలిసికట్టుగా పలుకుతూ, మాటలకి సరికొత్త వరుసలు కూర్చినట్లుగా వినిపించేయి. ఆ మాట వినగానే, చేతిలో ఉన్న వత్తిని పడేసి, చేతులు చీరకొంగుకి తుడుచుకుంటూ, ఆతృతగా వచ్చింది సీతమ్మ.

"మంచి శుభవార్త చెప్పేరు. కోడల్నీ, మనవల్నీ చూసి ఐదేళ్లవుతోంది. ఎన్నాళ్లుంటారో, యేమైనా రాసేడా? క్రితంసారి వచ్చినప్పుడు వారం కూడా ఉండలేదు..."

"ఆపుతావా నీ ధోరణి? ఉత్తరం పూర్తిగా చదవనీ..." సుందరంగారు అక్షరాలవెంటే కళ్లని కదుపుతూ, ఆ కదలికకి అనుగుణంగా కూనిరాగం తీస్తూ, ఉత్తరం చదవడం పూర్తి చేసేరు.

"నాకు ఇంగ్లీషు రాదనీ, కిష్టుడేమో తెలుగులో ఎలానూ రాయలేడనీ మీ బడాయి కదూ?"

సీతమ్మ గొంతుకలో కినుకని గ్రహించి,

"అదేంలేదు లేవే, ఈ సారి నెల్లాళ్లు శలవులట."

"పోన్లెండి, మంచి మాట చెప్పేరు, కిందటి..."

"నెల్లాళ్లూ ఇక్కడే ఉండిపోతా రనుకొంటున్నావేమిటే, పిచ్చిదానా! పదిరోజులిక్కడ, పదిరోజులు అత్తవారి ఇంట్లోను, నాలుగురోజులు స్నేహితుల ఇళ్లలోను, మిగతా రోజులు ప్రయాణాలకీ, ... అంతా కలిపి నెల...! అర్థమైందా? తమ్ముణ్ణీ, చెల్లినీ కూడా కుటుంబాలతో ఇక్కడకే రమ్మనమని రాయమన్నాడు. విడిగా వాళ్ల దగ్గరకి వెళ్లాలంటే టైములేదు కద...!"

"ఆ! అదే బాగుంది. ఇవాళే అందరికీ ఉత్తరాలు రాసి, పోస్ట్ చెయ్యండి. ఇంకేం, మనకి బోల్డు సందడి. ఇప్పుడే చిట్టెమ్మకి కబురు చేస్తాను. ఆ పది రోజులూ

వంటవండిపెట్టడానికి. బోల్డు పనులున్నాయి. మరి..."

సీతమ్మ బుర్రలో అప్పుడే బోలెడన్ని ఊహలు నాట్యం చేసేస్తున్నాయి.

"సీతాలూ, నువ్వు ఊరికే అలా హైరానా పడి బీ.పీ. పెంచీసుకోకు" అని సుందరంగారు వారిస్తున్నా వినకుండా, పిండివంటలూ, స్వీట్సూ అన్నీ ముందుగానే తయారు చేయించింది. అటకమీదనుంచి ఉయ్యాలగొలుసు, బల్ల దింపించి, ముందు వరండాలో ఉయ్యాల తగిలింప చేసింది.

ఎలాగైతేనేమి, ఎదురు చూసిన రోజు రానే వచ్చింది.

కారు దిగిన మనవడు ప్రసాదు, "మీరు మా డాడీకి మమ్మీ డాడీ కదూ? నమస్తే" అని అతి కష్టంగా తెలుగులో వత్తి పలుకుతూ, తాతకీ, నాన్నమ్మకీ, కాళ్లకి వంగీ వంగనట్లు వంగి నమస్కారం చేసేననిపించేడు. ఇద్దరి చేతులూ కలిపి పట్టుకొని కుదుపుతూ 'షేక్‌హేండ్' ఇచ్చేడు సంతోషంగా,

"నాన్నమ్మ, తాత, అనో, గ్రాండ్‌మదర్, గ్రాండ్‌ఫాదర్ అనో అనవచ్చు కదా" అని సీతమ్మ, సుందరం ఒక అరక్షణంలో "ఎక్స్‌ఛేంజ్" చేసుకొని తిరిగి, వెంటనే సర్దేసుకుని, మనవడు మన పద్ధతిలో నమస్కారం చేసినందుకు ఉప్పొంగిపోయేరు.

కారు దిగిన కొడుకు, కోడలూ వంగి కాళ్లకి నమస్కారాలు చేసి, ఆప్యాయంగా ఇద్దరి భుజాలమీదా చేతులు వేసి కుశల ప్రశ్నలు వేసేరు. అందరి కన్నా వెనకాల కారు దిగిన పన్నెండేళ్ల మనవరాలు సుజాత,

"హాయ్ గ్రానీ, హౌ ఆర్యూ? హాయ్ తాతా, హౌడుయుడూ? ఏమ్టీ, యు ఆర్ లుకింగ్ వెరీ ఓల్డ్? యు ఆర్ లుకింగ్ ఇన్ ఎయ్‌టీస్. బట్ ఫొటోస్‌లో ఇంకా యంగ్‌గా ఉన్నారు. యామై రైట్ డాడీ" కూతురి మాటలు విన్నా, విననట్లు, కృష్ణమూర్తి,

"అమ్మా, నీ ఒంట్లో ఎలా ఉంది? నాన్నా నీ ఒంట్లో కులాసాగా ఉందా? బాగా వీక్‌గా కనిపిస్తున్నారిద్దరూను."

సుందరంగారు, "అదేం లేదురా, మేం బాగానే ఉన్నాం. పదండి. ఇంట్లోకి పదండి. పిల్లలు బాగా పొడవయేరు. జయేమో కొంచెం చిక్కింది. కిష్టుడికి మాత్రం సిరిబొజ్జ వచ్చింది" అని చివరవి భార్య సీతాలుతో అన్నట్లు అంటే, "సిరిబొజ్జా, చిరుబొజ్జా" అంది కోడలు ఆశ్చర్యంగా.

"ఆ! అదేలే, అవ్వ పేరే ముసలమ్మ" అని సుందరంగారు అన్నదానికి అందరూ నవ్వుకుంటూ ఇంట్లోకి వెళ్లేరు.

"అమ్మా, నీచేతి కాఫీనే తల్చుకొంటుంటాను. వేడి వేడి కాఫీ... ఇవ్వమ్మా. అమ్మా పిల్లలకి కూడా ఇవ్వాళ నీ చేతి కాఫీ రుచి చూపించు. వాళ్లకి కాఫీ అంటే ఏమిటో తెలుస్తుంది" అన్నాడు కృష్ణమూర్తి గర్వంగా.

సుజాత కాఫీ రుచి చూస్తూనే,

"ఛీ. ఇదేనా మీ మమ్మీ చేతికాఫీ అంటే? ఏం బాగులేదు. చేదు చేదు" అని గ్లాసక్కడ విసురుగా పెట్టింది. ప్రసాదుకి కూడా ఆ కాఫీ నచ్చలేదు. అప్పుడు సుజాత,

"అయామ్ సారీ డాడీ, మీ అమ్మ చేసిన కాఫీ మీరే తాగాలి, మీరే పొగడాలి" అంటే మనవరాలు చేసిన కామెంట్‌కి సీతమ్మ ముఖం ఎంతో చిన్నబోయింది. ఐనా తమాయించుకొని, పిల్లలకి బోర్నవీటా కలిపి యిచ్చింది.

కొడుకు, కోడలూ బంధువులందరి గురించీ కుశలప్రశ్నలు వేసి కబుర్లు చెప్తూంటే, చిట్టమ్మగారు వేడివేడిగా అందించిన పెసరట్ ఉప్మాలు ప్లేట్లలో పెట్టి అందరికీ ఇచ్చింది సీతమ్మ. ఎంతో బాగున్నాయని అందరూ మెచ్చుకుంటూ తినగానే, సీతమ్మ మనసు ఆనందంతో నిండిపోయింది.

"నాన్నమ్మా, పెసపట్స్ సూపర్బ్‌గా ఉన్నాయి. నీ కాఫీలాగ లేవు" అంది సుజాత వెటకారంగా.

"నీకు ఆటపట్టించడానికి నాన్నమ్మ దొరికిందా సుజీ" నవ్వుతూ అన్నాడు, కృష్ణమూర్తి.


"పెసరట్స్ కాఫీలాగ ఎందుకుంటాయి సుజాతా?" అని సుందరంగారు, మనవరాలితో వేళాకోళమాడేరు.

"ఐ నో ఇట్..." అంది సుజాత మూతి వంకర్లు తిప్పి.

"నాన్నా, సుజీని మనమెవ్వరం మాటల్లో గెలవలేం. అది వాళ్ల స్కూల్లో డిబేట్, ఎక్స్‌టెంపో అన్నిట్లోనూ ఫస్టే" గర్వంగా చెప్పేడు, కృష్ణమూర్తి.

టిఫిన్లయ్యాక, సామానంతా తీసి గదిలో సర్దుకుని, వాళ్లు తెచ్చిన కార్డ్‌లెస్ ఫోను, కళ్లజోళ్లు, వగైరా విదేశీ వస్తువులన్నీ అందించేరు.

రాత్రికి అందరూ హెవీగా ఉందంటూ మజ్జిగలు తాగి పడుక్కున్నారు. మర్నాడు ఉదయం సీతమ్మ పూజముగించే టైముకి పిల్లలిద్దరూ పూజగదిలోకి వచ్చి, అక్కడున్న దేవుళ్ల ఫొటోల గురించి ప్రశ్నలు వేసి.



## తెల్లబోయింది!

సాధారణంగా సీరియస్ పుస్తకాలే చదివే ఊర్మిళామాతోండ్కర్‌కు ఎందుకనో ఓ సినీపత్రికను చదువుదామనిపించి, కొనుక్కుందిట. అది తెరవగానే రాణీముఖర్జీకి సంబంధించిన వార్తలూ, బొమ్మలూ వుండటంతో, రాణి తల్లి ఆ పుస్తకాన్ని ఊర్మిళ చేతుల్లోంచి లాగేసుకుని చక్కాపోయిందిట. పూర్తిగా చదివేదాకా తిరిగివ్వకపోతే, కోపంతో ఎర్రబడిన ముఖంతో పాపం, ఊర్మిళ, మరో సీరియస్ పుస్తకాన్నే ఆశ్రయించింది. అయినా తీసుకున్నవాళ్ల కుండాలి!

ఆశ్చర్యంగా వింటూంటే, ఆవిడకి మతిపోయినట్లైంది. 'వీళ్లకి మన దేముళ్ల పేర్లే తెలియవా? ఇదెలా సాధ్యం' అనుకొంది వింతగా.

పిల్లల మాటల్లో తేలిందేమిటంటే, జయ, కృష్ణమూర్తి ఉద్యోగాల టైములు వేరు వేరు. అందరూ కలిసి ఇంట్లో ఉండే టైము చాలా తక్కువ. ఆ కలిసి ఉన్న టైముల్లో సరదాగా బయట భోజనాలు, పిక్నిక్‌లు, స్నేహితులతో సరదాగా గడపడంతోనే సరిపోతుంది. అందుకే పిల్లలకి, భారత, భాగవత, రామాయణాల కథలు గాని, ఆ కథల్లో వచ్చే పిట్టకథలుకానీ ఏవీ తెలియవు. వాళ్ల మాటలు వింటే సీతమ్మకి జాలి కల్గింది.

మధ్యాహ్నం భోజనాలయ్యాక పిల్లలకి గజేంద్రమోక్షం కథ చెప్తూంటే, కథని సరిగ్గా వినకుండా హాస్యంగా కొట్టిపారెయ్యడం, విన్న కథని నమ్మకపోవడమూతో, నానా గొడవ చేసేరు. 'మీరిలా కొట్టిపారేస్తున్నారు కాని ఇవన్నీ మన పురాణగాథలు, పురాణాలంటే మనకి దేముళ్లతో సమానం. వీటి విలువ నేనెలా చెప్తే మీ కర్థం అవుతుందో నాకర్థం కావటం లేదురా' అని సీతమ్మ బాధపడుతూంటే,

"ఏమో, మా మమ్మీ, డాడీ, మాకెప్పుడూ చెప్పనే లేదు, మాకెలా తెలుస్తుంది?" అంది సుజాత.

"ఇక్కడ స్కూలు పుస్తకాల్లో కూడా ఈ కథలున్నాయి తెల్సా?" అంది, సీతమ్మ.


"మా బుక్స్, మా సిలబస్ అంతా వేరే. మాకివన్నీ చదవాల్సిన అవసరం యేమీ లేదు" అన్నాడు ప్రసాదు.

'మాకీ కథలంటే ఇంట్రెస్ట్ లేదు' అంటూ ఇద్దరికిద్దరూ లేచి వెళ్లిపోయేరు.

"తన పెద్దరికానికి వీసమెత్తైనా విలువ యివ్వకుండా ఎలా వెళ్లిపోయేరో... ఐనా పిల్లల్ని అనవల్సిన పని లేదు. వీళ్లని కన్న పెద్దలకీవిషయంలో సంబంధమే లేనట్లుంది వాళ్ల ప్రవర్తన. వాళ్లదో లోకం- వీళ్లదో లోకం- మధ్యలో తనకే ఈ అలౌకికం!" అని మనసులో ఆలోచిస్తూ ఉండగా, వర్షం మొదలై, జోరు ఎక్కువైంది. వంటిల్లంతా గాలికి జల్లుతో తడిసిపోయింది.

"సూజీ, చూడు, ఈ వర్షాల్లోనే చిన్నప్పుడు మేం పేపర్ బోట్స్ వదిలి పోటీలు పడేవాళ్లం తెల్సా?" సంబరపడుతూ చెప్తున్నాడు, క్రిష్ణమూర్తి.

"ఐ డోంట్ లైక్ దిస్ డాడీ, అంతా మడ్వాటర్,



**అమ్మో, జాగ్రత్త!**

సంజయ్ దత్ బాడీ బిల్డర్, నటుడు. అంతే కాక ఇప్పుడు తన తరువాతి చిత్రానికి కథారచయిత కూడా అవుతున్నాడు. అతని గొప్ప హాబీ ఏమిటో తెలుసా? రకరకాల కత్తులు సేకరించటం. కొంపదీసి తన కథ నచ్చలేదని నిర్మాతలెవరైనా అంటే వారిని తాను సేకరించిన కత్తులతో పొడిచెయ్యడు కదా? అనుకుంటున్నారట జనం.

ఛీ ఛీ! డర్టీగా ఉంది. అసలు బాంబేలో మనం ఫ్లైట్ దిగిన వెంటనే మొదలైంది ఈ వాన, బురద. అందుకే ఇండియాలో అంతా డర్టీగా ఉంటుంది"

"స్టాపిట్ సూజీ. స్టాపిట్. ఇండియాని మళ్లీ ఆ మాటన్నావంటే ఐ విల్ స్లాప్ యూ..." కోపంగా అరిచేడు. క్రిష్ణమూర్తి.

ఒక్క నిముషంలో వాతావరణంలో మార్పు వచ్చింది.

మర్నాడు ఉదయం గుడికి వెళ్లాలని ప్రోగ్రామ్ వేసేరు. ముణుకులు దిగని ప్యాంటూ, చేతుల్లేని బనీనూ వేసుకుని తయారైన సుజాతని చూసి, 'అమెరికాలో ఉంటే ఇలాటి బట్టలే వేసుకోవాలని రూలుందా యేమిటి. మర్యాదగా, గౌరవంగా, అసభ్యతగా కనిపించకుండా ఒంటినిండా బట్టలు వేసుకోవచ్చు కదా... అలాంటి డ్రెస్‌లు వేసుకోవటం మన సంస్కృతి కాదు తల్లీ' అని కూతురికి జయ ఎందుకు నచ్చ చెప్పలేకపోతోంది అని గోలపెడుతున్న మనసుని లోపల్లోపలే అదిమిపెట్టి,

"సుజాతా మీ అత్త నీకోసం పట్టు పరికిణీ, జాకెట్, ఓణీ పంపించింది. వాటిని తొడుక్కుని ఓ ఫొటో తీయించుకొని పంపమంది కూడా. ఎలాగూ గుడికి వెళ్తున్నాం కదా, ఆ డ్రెస్ వేసుకోవే అమ్మా" అంది సీతమ్మ, అనునయంగా.

పేకెట్లోంచి మడత విప్పి, పరికిణీని పరిశీలనగా చూస్తూ, 'వాటే ఫన్నీ డ్రెస్? ఫాన్సీడ్రెస్‌లా ఉంది నేను వేసుకోను బాబూ' అని మురిపిస్తోంది సుజాత. జయేమో, 'సూజీ, నీకీ కలర్ ఎంతో బాగా సూటవుతుంది. అత్త నీకెంతో ప్రేమగా పంపింది కదా, వాటీజ్ రాంగ్ ఇఫ్ యు వేరిట్? డాడీ కూడా నిన్నీ డ్రెస్‌లో చూస్తే...' ఓపిగ్గా నచ్చ చెప్తోంది.

సీతమ్మ ఇంక ఉండబట్టలేక, 'నీ ప్యాంట్, టీషర్టూ కన్నా ఇదే బ్రహ్మాండంగా ఉంది. ఓ సారి వేసుకోవే అంటే ఏమిటి చెప్పు ఆ మురిపించడం?' అందో లేదో,

"మమ్మీ, వాటీజ్ రాంగ్ విత్ మై డ్రెస్, టెల్ మీ! వై షి ఈజ్ టాకింగ్ లైక్ దట్? అత్త పంపిందంటే, ఓకే, వేసుకొంటాను. కాని, నా డ్రెస్ ఎందుకు బాగా లేదు? నువ్వూ డాడీ, నా డ్రెస్ బాగులేదని ఎప్పుడూ అనలేదు కదా! హౌ ఈజ్ షీ టు సే దట్?"

ఇంగ్లీషు మాటలే ఐనా ఆ మాటలు ఈటెల్లా సూటిగా సీతమ్మ గుండెల్లో గుచ్చుకున్నాయి. 'ఔన్లే. తల్లిదండ్రులకన్నా పిల్లల బాగోగులు చూసేది ఇంకెవరు? నిజమే, తానెవరు మధ్యలో, పానకంలో పుడకలాగ! మర్యాద ఇచ్చి పుచ్చుకోమన్నారు, పెద్దలు. ఎవరి హద్దుల్లో వాళ్లు ఉన్నంత సేపే మర్యాద. చిన్నపిల్ల, దాన్ని అనడం ఎందుకు? తనబుద్ధి ఏమైంది?' అనుకొంటూ తలవంచుకొని మౌనంగా సీతమ్మ తన గదిలోకి వెళ్లిపోయింది. తల్లీకూతుళ్ల వాదనలు విని క్రిష్ణమూర్తి ఆ గదిలోకి వెళ్లటం, ఏవో తర్జనభర్జనలు పడటం లీలగా వినిపిస్తూనే ఉన్నాయి. కొంతసేపటికి క్రిష్ణమూర్తి గదిలోంచి వస్తూ,

"అమ్మా దానికెంతతోస్తే అంతే! ఎవరిమాటా వినదు. నువ్వేమీ పట్టించుకోకమ్మా" అని చెప్పేశాడు.

అంతే మరి... అలాగే సర్దుకోవడం మంచిది, అనుకొంది సీతమ్మ.

కొంతసేపటికి ప్రసాదు, 'తాతా ప్లీజ్... ఒక్కసారి...' అంటూ బతిమాలుకున్నాడు సుందరంగారిని. ఒకరి వెనక ఒకరు ఏమిటంటూ అడిగితే, ప్రసాదు, "తాతని జీన్స్ ప్యాంట్, టీ షర్టు వేసుకోమంటే ఒప్పుకోవటం

లేదు" అన్నాడు దీనంగా, 'డెబ్భై దాటిన నాకా వేషాలేమిట్రా?' అని సుందరయ్యగారు అంటున్నా వినిపించుకోకుండా క్రిష్ణమూర్తి, నాన్నకోసం తెచ్చిన టీషర్టు, ప్యాంట్ అందించేడు ఉత్సాహంగా.

సుందరంగారు బట్టలు మార్చుకునేలోగా, ఎప్పుడు వెళ్లిందో, సుజాత, గదిలోకి వెళ్లి పట్టుపరికిణీ, ఓణీ సింగారించి, బొట్టూ కాటుకా పెట్టుకుని చక్కగా తయారై వచ్చింది. 'నేను రెడీ' అంటూ.

కోడలు తెచ్చి ఇచ్చిన కంచి పట్టుచీరలో కొత్త పెళ్లికూతురిలా సిగ్గుపడిపోయింది సీతమ్మ. బట్టలు మార్చుకుని రాగానే సుందరంగారి వయసు పదేళ్లు వెనక్కి వెళ్లినట్టు కనిపించేరు. అందరి నవ్వులతో ఇల్లు మార్మోగుతూంటే, ఆ మధురక్షణాన్ని ప్రతీకోణం నుంచీ చటుక్కున కెమేరాలో బంధించేడు కృష్ణమూర్తి.

విందుభోజనం చేసి విశ్రాంతి తీసుకునే సమయంలో, క్రిష్ణమూర్తి,

"నాన్నా, ఈ ఇల్లంతా పాతబడిపోయింది. దీన్ని అమ్మేసి, మోడర్న్ సౌకర్యాలతో ఉన్న ఇల్లు కొనాలనుకుంటున్నాను. మా కంట్రాక్టర్ ఫ్రెండ్‌తో మాట్లాడేను. మీరూ ఆలోచించండి."

"ఈ ఇంట్లో మా తాతలంతా ఉన్నారు. దీన్ని... దీన్ని అమ్మడమా?"

"ఏమిటి నాన్నా మీకీ సిల్లీ సెంటిమెంట్స్? అదే నాకు నచ్చదు. అమ్మా నువ్వైనా నచ్చచెప్పు నాన్నకి" అని కాస్త కోపంగానే అనేసి గదిలోకి వెళ్లిపోయేడు.

సుందరంగారు తన గదిలోకి వెళ్లి పాత రిస్ట్ వాచీ తీసి చూసుకొంటూంటే, వెనకాలే ప్రసాద్,

"నీ వాచీ ఏజ్ ఎంత తాతా?"

"యాభై యేళ్లురా"

"ఇప్పుడూ పనిచేస్తోందా తాతా?"

"ఈ మధ్యే ఆగిపోయింది"

"దెన్ త్రోయిట్ ఎవే. ఓల్డ్ జంక్‌ని ఇంకా ఎందుకుంచేవు? నేనైతేనా ఎప్పుడో విసిరేద్దును."

"ఈ వాచీ మా తాతగారిచ్చేరు తెల్సా?"

"సో వాట్?" అంటూ భుజాలెగరేసేడు.

ఇంతలో ఆటో దిగి కూతురు, అల్లుడు, మనవలూ వస్తూన్నట్లు కనిపించి సుందరంగారు వెళ్తోంటే అతని తోడు అందరూ ఎదురు వెళ్లేసరికి మరో ఆటోలో చిన్నకొడుకు, కోడలు, మనవలు కూడా దిగేరు. ఇంక ఇల్లంతా దీపావళి వెలుగులే. నవ్వుల పువ్వులతో, పిల్లల కేరింతలతో అందరి మొహాల్లో ఆనందంతో ఇంటికి కొత్తకళ వచ్చింది. అందరూ హడావిడిగా ఒకటే పలకరింపులు, కబుర్లూను.


అందరూ కలిసిన సందడిలో రోజులు ఎల్లా దొర్లిపోయేయో తెలియనే లేదు.

ఏడాదిలోగా ఆ ఇంటిని తీసేసి, కొత్త ప్లానుతో మరో ఇల్లు కట్టే ప్లానంతా వేసి మరీ వెళ్లేడు క్రిష్ణమూర్తి. కొత్త మార్పుకి, ప్రస్తుత పరిస్థితులని బట్టి సీతమ్మ, సుందరంగారు, ఒప్పుకోక తప్పలేదు.

అందరూ ఎలా వచ్చేరో, అలాగే తిరుగు ప్రయాణాలయేరు. ఒక్కొక్కరికీ వీడ్కోలిచ్చి సాగనంపి, భారమైన మనసుల్తో, సీతమ్మ, సుందరంగారు ఇంట్లోకి వెళ్లబుద్ధికాక, వరండాలో ఉయ్యాలబల్లమీదే కూలబడ్డారు. ఇల్లంతా ఇంకా

## ఐశ్వర్యను పొమ్మన్నాట్ట!

బాలీవుడ్ నటుడు ఆమీర్ ఖాన్. 'గులామ్' చిత్రం హిట్ అయ్యాక రాణితో చనువుగా వుండేవాడు. ఆ చనువు ఎంత వరకొచ్చిందంటే, రాణి, ఆమీర్, భార్య రీనాతో కూర్చుని మాట్లాడుతున్నప్పుడు పడగ్గదిలో కొచ్చేంత. తరువాత 'లగాన్'లో రాణికి బదులు గ్రేసీని తీసుకున్నాడు భార్య కన్నీళ్లు తుడిచేందుకు. ఇప్పుడు 'మంగల్ పాండే'లో ఐశ్వర్యను కాదని రాణిని ఆహ్వానించాడు. ఎందుకంటే, " 'దేవ్‌దాస్' వంటి గొప్ప చిత్రంలో పారో వంటి మహత్తరపాత్రపోషణ చేసిన ఐశ్వర్య, 'మంగల్ పాండే' సరసన నటించేందుకు సూట్ కాదు" అన్నదే ఆమీర్ సమాధానం. భేష్!



పిల్లలు పరిగెడుతున్నట్లే ఉంది. అందరి నవ్వులతో ప్రతిధ్వనిస్తున్నట్లే ఉంది. ఐనా అంతలోనే అంతా నిశ్శబ్దం. ఆ నిశ్శబ్దంలోనే అంతరాంతరాల్లో ఏదో సముద్రపు ఘోష వారిద్దరినీ కలవరపెడుతోంది. ఇద్దరికీ ఏవో కబుర్లు చెప్పుకోవాలనే ఉంది. ఎలా ఎక్కడ మొదలుపెట్టాలో తెలియని అయోమయావస్థలో ఉన్నారు. చివరికి,

"సీతాలు, నీ మాట పెడచెవినపెట్టి కిష్టుడికి తెలుగు నేర్పించడంలో అలక్ష్యం చేసేను చూడు. అన్ని సబ్జెక్ట్సులోనూ డిస్టింక్షన్స్ తెచ్చుకొంటున్న కిష్టుడు పెద్దయ్యాక తెలుగు కూడా అంత సులువుగానూ నేర్చేసుకొంటాలెమ్మని భ్రమపడ్డాను. ఆంధ్రరాష్ట్రానికి దూరంగా ఉండి, కాన్వెంట్ చదువులనే సాకుతో నేను ఆ నాడు ఒక రకంగా తప్పు చేసేను. ఇప్పుడు, పై దేశంలో ఉంటూన్న మనవలకి మన భాష, మన సాంప్రదాయం, మన సంస్కృతి, పురాణ గాధలూ తెలియవని బాధపడ్డంలో ఏదైనా అర్థం ఉందంటావా చెప్పు?

మనదేశంలోనే పట్నాలలో ఉంటూన్న తొంభైశాతం పిల్లలూ ఇలాగే పెరుగుతున్నారు సీతా. అమ్మా నాన్నా ఉద్యోగాలు చేసి, పిల్లల భవిష్యత్తుకోసం డబ్బులు తెగ కూడబెడుతున్నారే కానీ, తమ పిల్లల ఆలోచనలు, వాళ్ల ప్రవర్తన, ఎలా ఉన్నాయి? ఎలా ఉండాలి అని ఒక్క క్షణం ఐనా నిదానంగా ఆలోచిస్తున్నారంటావా?"

"అదేనండీ నా బాధాను, పిల్లలకి తెలియవల్సిన కనీసపు సభ్యత, పెద్దలంటే గౌరవం, మంచీ, చెడ్డా, చెప్పవలసిన బాధ్యత ప్రతీ తల్లికి, తండ్రికీ లేదూ?

పిల్లలే ముందు తరానికి పెద్దలవుతారు. వీళ్లే ఇలా జీవన మూల్యాలు తెలియని మూర్ఖులైతే, వీళ్ల ముందు తరాల గతేంకాను?

జయా, కిష్టుడూ, పిల్లల్నే వెనకేసుకు రావడం నాకేమీ సబబుగా అనిపించలేదు. ప్చ్! ఎప్పటికైనా సరే వీళ్ల మనసులలోను, ఆలోచనల్లోను, ఆచరణల్లోనూ మార్పు అంటూ రావాలి. వాళ్ల కర్తవ్యం వాళ్లు తెలుసుకోవాలి. అదే పదివేలు. అంతే చాలు" అని ఎంతో ఆర్తంగా అన్న మాటతో సీతమ్మ కంఠం వణికింది.

ప్రొద్దు వాలుతోంది. సంజ చీకట్లు క్రమేపీ ముసురుకొంటూంటే, సంధ్యా దీపం వెల్గించడానికి దేవుడిగదిలోకి సీతమ్మ వెళ్లింది. ■